

విజయవాడ ఖేలన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన కర్ణాటక, హిందూస్థానీ సంగీత "జుగల్‌బంది" కార్యక్రమం దృశ్యం

మనం నమ్మిన మన నాయకులే కప్పల తక్కెడ రాజకీయాలతో వున్నప్పుడు మనం పార్టీ రంగులు మార్చడం ఏమంత లెక్కలోకి రాదు. స్వయాన బావమరుదలం. కనుక మనిద్దరం చెయ్యి కలిపితే గ్రామంలో మనకు ఎదురుండదు. ఏమంటావ్?"

"బావా! ఇన్నాళ్ళకు నీకు అసలయిన రాజకీయ లక్షణాలు అబ్బాయి. అంటే ప్రజలేమయినా నాలుగు కాలాలపాటు ఏ ఎండకాగొడుగు పట్టి నిలదొక్కుకునే స్థితికొచ్చావు. నేనూ నీతో చేతులు కలుపుతాను. ఇక నుంచీ మనం ఒకటే పార్టీ సభ్యులం."

"మరి నే వెళ్ళొస్తాను."

"ఉండు! కాఫీ తాగుదువుగాని."

బావమరుదులిద్దరూ తృప్తిగా కాఫీ తాగారు.

— రోషన్‌వర్మ

---

# మందు

వైద్య శిఖామణి దత్తాగారు తమ సకల రోగ నివారిణి, సంజీవిని లాంటి మందులని, మూలికలని, చూర్ణాలని చిన్న చిన్న సంచుల్లో రోడ్డుమీద పరచి వాటి గొప్పతనం హిందీలో చెబుతున్నాడు. ట్రాన్స్‌లేటర్ తెలుగులో అనువాదం చేస్తున్నాడు. ఇంకో సహాయకుడు పక్కన కూర్చొని వున్నాడు. చుట్టూ మూగిన జనం వెర్రిమొహాలేసుకొని వింటున్నారు.



దత్తాగారు పెద్ద పెద్ద మీసాలతో మళయాళీ మాంత్రికుడిలా వున్నాడు. ట్రాన్స్‌లేటర్ బొత్తాలు విప్పిన చొక్కాలోంచి ఎముకలు కనిపిస్తూ చీకేసిన ఆవకాయ పెచ్చులా వున్నాడు. సహాయకుడు డిటోగానే వున్నాడు.

దత్తా చేతిలో బాటరీ మీద పనిచేసే మైక్ సెట్ వుంది. అతను మాట్లాడుతుంటే గొంతులో స్టీరియో ఉన్నట్టుగా శబ్దం బొంగురుగా, కీచుగా వస్తోంది. ట్రాన్స్‌లేటర్ గట్టిగా అరుస్తూ అనువాదం చేస్తున్నాడు.

దత్తా అన్ని మందుల గొప్పతనం చెప్పాడు. అవి పని చెయ్యని రోగం అంటూ లేదు. రొంప, దగ్గు, జ్వరము, మూర్ఛ, నొప్పులు, కురుపులు, గుండె జబ్బులు మొత్తం ఎటు జడ్ అన్ని జబ్బులకీ పనిచేస్తాయన్నాడు. తను అశ్వనీ దేవతల్లో ఒకన్నాడు. ఆలస్యం చెయ్యక వెంటనే కొనుక్కోమని జనానికి సలహా యిచ్చాడు.

అంతవరకు వెర్రిమొహాలేసి వింటున్న జనం కొస్త తెప్పరిల్లి ఎవడు ఏ కేటగిరి జబ్బుకి చెందుతాడో నిర్ణయించుకుని మందులు కొనుక్కున్నారు. దత్తాగారికి నలభై రూపాయలు కలక్షనయింది.

కొనుక్కున్న మందు భద్రంగా జేబుల్లో పెట్టుకున్నారు జనం. ఇంతలో "ధభాల్న" క్రింద పడ్డాడు ట్రాన్స్‌లేటర్. దత్తా కంగారుగా లేచి ట్రాన్స్‌లేటర్‌ని పట్టుకుని కుదిపాడు. వాడికి స్పృహ లేదు. ఊరికే మూలుగుతునాడు. ఎడంచేత్తో గుండె దగ్గర గట్టిగా పట్టుకున్నాడు. జనం వింతగా చూస్తున్నారు.

దత్తా రిక్షాని పిలిచాడు. సహాయకుడిని మందులని చూస్తుండమని చెప్పి ట్రాన్స్‌లేటర్‌ని జనం సాయంతో రిక్షాలో కూర్చోపెట్టి రిక్షావాలాని హాస్పిటల్‌కు పోనిమ్మన్నాడు.

జనంలో ఒకడు అడిగినదానికి సహాయకుడు చెప్పిన దాని సారాంశం ఏమిటంటే, ట్రాన్స్‌లేటర్ ఒక సంవత్సరం నుంచి గుండె నొప్పి, మూర్ఛతో బాధపడుతున్నాడని, అప్పుడప్పుడు ఇలా పడిపోతున్నాడని....

జనం అందరికీ ఒకే సందేహం కలిగినా ఏమని అడగాలో తెలియక తెల్లమొహాలేసుకుని వెళుతున్న రిక్షావేపు చూడసాగారు.

వాళ్ళ జేబుల్లో మందు భద్రంగా ఉంది

— కస్తూరి సాయిప్రసాద్

★